సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 29 । ఆగస్టు । 2024



గంజాయి పట్టివేత

మహబూబాబాద్‌లో రూ.5.45లక్షల విలువైన గంజాయిని పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

- 8లో ▸



ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి

తల్లిదండ్రుల ఆలోచనతీరు మారడంతో ఆడపిల్లలను సైతం అపురూపంగా పెంచుతూ ఇంటికి మహాలక్ష్మిగా భావిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$32^0 / 24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓఎస్డీగా బోనాల కిషన్



భూపాలపల్లి: జిల్లా ఓఎస్డీ(ఆపరేషన్ విభాగం అదనపు ఎస్పీ)గా బోనాల కిషన్ జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కిరణ్ ఖరేను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

4న అథ్లెటిక్స్ ఎంపికలు

భూపాలపల్లి అర్బన్ : జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలను సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొక్కూరి చిన్నరాజయ్య, పూతల సమ్మయ్య బుధవారం తెలిపారు.అథ్లెటిక్స్ పోటీలు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్–14, 16, 18, 20 ఏళ్ల లోపు బాలబాలికలకు లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిభ కనబర్చిన 30 మందిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

దారం తీసే మిషన్‌కు సబ్సిడీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని నేత కార్మికులకు దసిలి, పట్టుతో దారాన్ని తీయడానికి 75శాతం సబ్సిడీపై దారం తీసే యంత్రాన్ని అందజేయనున్నట్లు కేంద్ర దసిలి మండలి ధర్మవరానికి చెందిన శాస్త్రవేత్త సంజీవ్ గుప్తా తెలిపారు. బుధవారం టస్సర్‌కాలనీలో నేతకార్మికులకు దారం తీసే పద్ధతిపై శిక్షణ ఇచ్చారు. యంత్రం ధర రూ.30వేల వరకు ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట చెన్నూర్‌కు చెందిన భగవాండ్లు, సీనియర్ టెక్నీషియన్ అశోక్ దేశాయి తదితరులు ఉన్నారు.

శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి

భూపాలపల్లి రూరల్ : తాడిచర్ల ఓపెన్ కాస్ట్ (ఓసీ) నుంచి చెల్పూరు జెన్‌కో వరకు బొగ్గు రవాణా చేసేందుకు ఏర్పాటు చేస్తున్న కన్వేయర్ బెల్ట్ వల్ల భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంతో పాటు కుటుంబాల సభ్యులకు జెన్‌కోలో శాశ్వతంగా ఉద్యోగాలు కల్పించాలని రొంటాల విప్లవ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి, మహబూబ్‌పల్లి, గంగ్రపల్లి, చీపల్లి గ్రామాల రైతులతో ఆర్డీఓ కార్యాలయంలో రైతులలో అధికారులు భూసేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం చీపల్లికి చెందిన రైతు విప్లవ కుమార్‌రెడ్డి మాట్లాడారు. కన్వేయర్ బెల్ట్ వేయడం వల్ల పచ్చని గ్రామాల్లో కాలుష్యం పెరుగుతుందని, నివసించే పరిస్థితి ఉండన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి, నివాసయోగ్యమైనా స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



మొగుళ్లపల్లి : మండల కేంద్రంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ ద్వారా రైతులు తమ వ్యవసాయ భూమిలో నాటిన పండ్ల మొక్కలను, చేపల పెంపకం స్థలాన్ని బుధవారం డీఆర్‌డీఏ అదనపు పీడీ వసుమతి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎండీ హుస్సేన్, ఇన్‌చార్జ్ ఏపీఓ అలీ, టీఏ రాము పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



భూపాలపల్లి రూరల్ : తెలంగాణ గ్రామ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలవేణి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా తోట నరేష్, గౌరవ అధ్యక్షులుగా ఆంగోత్ సమ్మయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్హర్ మండలంలోని పెద్దతూండ్లలో పంట వివరాలు నమోదు చేస్తున్న అధికారులు



సర్వే స్లో

నెమ్మదిగా సాగుతున్న పంటల సాగు వివరాల నమోదు

- క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్న ఏఈఓలు
- ఇప్పటి వరకు 1,14,972 ఎకరాల్లో పూర్తి
- ఇంకా 1,15,110 ఎకరాల్లో పూర్తి కావాల్సి ఉన్న సర్వే

భూపాలపల్లి రూరల్: జిల్లాలో పంటల దిగుబడి అంచనా వేయడం, సాగు లెక్క పక్కాగా ఉండేలా వానాకాలం సీజన్‌లో జిల్లాలో సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. పంటల సేకరణతో పాటు మార్కెటింగ్‌లో రైతుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రతిఏటా ప్రభుత్వం క్రాప్ బుకింగ్ చేపడుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అన్నదాతలు సాగు చేస్తున్న పంటలను స్వయంగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. అయితే ఈ సర్వే ప్రక్రియ ఆగస్టుతో ముగియాల్సి ఉన్నా నెమ్మదిగా సాగుతోంది.

2,30,082 ఎకరాల్లో సాగుకు అంచనా..

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడం, పెద్ద చెరువులతో పాటు, కుంటలు పూర్తి స్థాయిలో నిండటంతో ఈ సీజన్‌లో 2,30,082 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ సీజన్‌లో పత్తి ఎక్కువగా సాగు చేశారు. అలాగే పలుచోట్ల వరి, కంది, మిరపతో పాటు తదితర పంటలు ఇంకా సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో పంటల లెక్క పక్కాగా ఉండేలా ఇప్పటి వరకు 1,14,972 ఎకరాల్లో క్షేత్ర స్థాయిలో ఏఈఓలు పంటలను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఇంకా 1,15,110 ఎకరాల్లో పరిశీలించి వివరాలు నమోదు చేయాల్సి ఉంది.

లెక్క.. పక్కాగా..

రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను పక్కగా లెక్కించేందుకు అధికారులు ఈ సర్వే చేపడుతున్నారు. గతంలో దిగుబడులపై సరైన అవగాహన లేకపోవడంతో పంట మార్కెట్‌కు వచ్చిన సమయంలో అన్నదాతలు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. పత్తి, వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లలోనూ అధికారులకు సరైన ప్రణాళికకు ఉండేది కాదు. క్రాప్ బుకింగ్ తర్వాత జిల్లాలో పంటలు వివరాలను అధికారులు పక్కాగా నమోదు చేస్తున్నారు. దీంతో పంటల సాగు, దిగుబడులపై అంచనా ఏర్పడడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు పంట ఉత్పత్తుల సేకరణకు అధికారులు ప్రణాళిక వేసుకునేందుకు ఆస్కారం ఏర్పడింది.

జిల్లాలో వివిధ రకాల పంటల సాగు వివరాలు(ఎకరాల్లో)

పంటలు	సాగుఅంచనా	వివరాల నమోదు
వరి	1,11,890	24,201
పత్తి	85,691	85,691
కంది	20	18
మొక్కజొన్న	150	150
మిర్చి	25,800	586
పెసర	250	196
మినుము	30	30
ఆయిల్‌పామ్	2,000	250
ఇతర పంటలు	4,251	3,850

త్వరలోనే పంటల వివరాల నమోదు పూర్తి



రైతులు సాగు చేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలిస్తున్నారు. వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు. వరి, మిర్చి పంటలు ఇంకా సాగు చేస్తున్నారు. సాగు వివరాల లెక్కలు పక్కాగా నమోదు చేస్తుండటంతో దిగుబడులపై అంచనా వేయవచ్చు. దీంతో పంటల సేకరణ సైతం సులభతరం అవుతుంది. త్వరలోనే పంటల వివరాల నమోదు ప్రక్రియ పూర్తి అవుతుంది.

– విజయ్ భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఖిలా వరంగల్ కోటలో సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రులు సీతక్క, ప్రభాకర్, మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య,తదితరులు



వారసత్వ నగరం అద్భుతం

చారిత్రక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేద్దాం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. కాకతీయ శిల్పకళ చూసి ముగ్ధుడైన గవర్నర్
- వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులతో సమీక్ష
- వివిధ రంగాల నిపుణులతో చర్చాగోష్టి.. మధ్యాహ్న భోజనం



నగరంలోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రులు సీతక్క, పొన్నం తదితరులు

హన్మకొండ అర్బన్/హన్మకొండ కల్చరల్/ఖిలా వరంగల్: చారిత్రక వారసత్వ నగరమైన వరంగల్ మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు బాగుందని, ప్రభుత్వ పథకాలు పేదలకు చేరడం సంతోషకరమని, తద్వారా సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ముందుగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ చారిత్రక నగరమైన వరంగల్‌లో అనేక చారిత్రక దేవాలయాలు ఉన్నాయన్నారు. కాకతీయ శిల్ప సంపద తనను మంత్ర ముగ్ధుడిని చేసిందన్నారు. వ్యవసాయ రంగంలోనూ ముందుండాలన్నారు.రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, రైతులకు ఉచిత విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలపగా గవర్నర్ అభినందించారు.

వివిధ రంగాల ప్రముఖులతో చర్చాగోష్టి..

కలెక్టరేట్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు, నిపుణులు, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర అవార్డు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలతో చర్చాగోష్టి నిర్వహించారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హనుమకొండ రెడ్‌క్రాస్‌ను సందర్శించి అక్కడ చేపడుతున్న కార్యక్రమాల పట్ల నిర్వాహకులను అభినందించారు. తలసేమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, రోడ్లు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, తీన్మార్ మల్లన్న, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, రెండు జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, రెడ్‌క్రాస్ చైర్మన్ విజయచందర్‌రెడ్డి, వివిధరంగాల నిపుణులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు..కోట సందర్శన..

నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, భద్రకాళి, పద్మాక్షి అమ్మవారి ఆలయాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, భద్రకాళి శేషు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. కాగా, గవర్నర్ వేయిస్తంభాల ఆలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై మండపం పునర్నిర్మాణ పనుల ఏవీని వీక్షించారు. వేల సంవత్సరాల నాటి శిల్పనైపుణ్యం ఎలాంటిదో వేయిస్తంభాల, రామప్ప దేవాలయాలను చూస్తే అర్థమవుతుందన్నారు. సాయంత్రం ఖిలావరంగల్‌లోని శిల్పాల ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్‌కు దాండియా, బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం శిల్పాలను సందర్శించారు.ఖుష్‌మహల్‌ను తిలకించారు. స్వయంభూ శ్రీశంభులింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్భంగా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



నగరంలోని వేయిస్తంభాల ఆలయంలో శిల్పకళను చూస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన ర్యాలీ

భూపాలపల్లి అర్బన్ : విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని జయశంకర్, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రం అందజేసి, జయశంకర్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ డీఈఓ రాజేందర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాక్ అధ్యక్ష, కార్యదర్శులు జయ వసంతలక్ష్మి, తోకల వేణు మాట్లాడారు. గతేడాది ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొన్న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మెకు మద్దతు తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే తమకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 61ఏళ్లు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరసనలో జాక్ బాధ్యులు చాంద్‌పాషా, సునీత, సత్యనారాయణ, సుదర్శన్, శ్రీను, రాజు, నరేష్, హరీష్, కుమార్‌లు పాల్గొన్నారు.

బదిలీ వర్కర్లను క్రమబద్ధీకరించాలి

భూపాలపల్లి అర్బన్ : సింగరేణిలో 190 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లను వెంటనే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో బుధవారం కార్మికుల సమస్యలపై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ..బదిలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయకపోవడంతో భవిష్యత్‌లో వారికి వచ్చే ఎస్‌ఎల్‌పీలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఏడాది వారి మస్టర్లు నిండిన తర్వాత రెగ్యులర్ చేసి యాక్టింగ్ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలవెన్స్‌లపై ఐటీ మాఫీ వంటి దీర్ఘకాలిక డిమాండ్లు అమలు చేయించాలని కోరారు. లాభాల వాటా 35శాతం ప్రకటించాలని, కొత్త పెన్షన్ బకాయిలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణ్, నర్సయ్య, రాములు, భీమయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై యూత్ ఫెస్ట్

భూపాలపల్లి అర్బన్ : హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు యూత్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎయిడ్స్–లెప్రోసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి హాజరై మారథాన్ రెడ్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ..విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, 18 సంవత్సరాలు నిండిన వారందరూ రక్తదానం చేయాలని సూచించారు. హెచ్ఐవీ సోకిన వారిపై వివక్ష, చిన్నచూపు చూడరాదన్నారు. ఈ వ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయని, హెచ్ఐవీ సోకిన వారు పోషకాహారం తీసుకోవాలని దీంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, సీఎస్ఓ సారయ్య, ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రుక్షను, ఎన్‌జీఓ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మారథాన్ రెడ్ రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉమాదేవి

ఉత్సవమూర్తుల ఊరేగింపు

కాళేశ్వరం : కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయం శ్రీరామాలయంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఉత్సవమూర్తులతో పల్లకి సేవ కార్యక్రమాన్ని పుర వీధుల గుండా ఊరేగిస్తు, బుధవారం గోపాల కాల్వలు నిర్వహించారు. అనంతరం ప్రధాన ఆలయం రాజగోపురం ఎదుట ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. ఉట్టి కొట్టిన కామిడి శ్రీనివాసరెడ్డికి ఆలయం తరపున రూ.1,016 నగదును అందజేశారు. రామాలయంలో హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ ఏ.మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ సమ్మయ్య, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు ఐటీడీఏ, టీజీఐఐసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రభుత్వ, అటవీశాఖ, ఇరిగేషన్‌కు సంబంధించిన భూముల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎంత భూమి ఖాళీగా ఉంది, వేటి కోసం వినియోగిస్తున్నారని ఆరా తీశారు. కాటారం సబ్ డివిజన్‌లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు భూమి అవసరం ఉన్నందున ప్రభుత్వ భూమిని అంతా సమీకరించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నో ఇబ్బందుల మధ్య కాటారం మండలం గంగారంలో ఐటీఐ, టీజీఐఐసీ భవనాలకు స్థలం కేటాయించినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించలేదని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించకపోతే నివేదిక అందజేయాలని తహసీల్దార్ నాగరాజుకు సూచించారు. ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఆ సర్వే నంబర్లను గుర్తించి రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాయాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఇంటి నంబర్లు కేటాయించవద్దని డీపీఓను ఆదేశించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్లు కడితే కూల్చి వేయాలని ఆదేశించారు. అంతకముందు కొత్తపల్లిలో కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు యూత్ ట్రెనింగ్ సెంటర్ భవనాన్ని పరిశీలించి గదులు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీశారు. వైటీసీ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసి గిరిజన సంక్షేమ శాఖ డీడీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

కాటారం మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ మండల కేంద్రంలోని కేజీబీవీ, గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలను తనిఖీ చేసి సౌకర్యాలు, విద్యాబోధన, సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులతో పాఠాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ తప్పనిసరిగా పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. కేజీబీవీలో ఆర్వో వాటర్ ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్ సిస్టం ఏర్పాటుకు నివేదిక పంపిస్తే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఆరుబయట కూర్చొని భోజనం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన డార్మెంటరీని త్వరగా అప్పగించాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సేవలపై ఆరా తీయడంతో పాటు పీహెచ్‌సీలో సౌకర్యాలు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని బాలాజీ ప్రైవేట్ ఆస్పత్రిని కలెక్టర్ తనిఖీ చేసి ఆస్పత్రి అనుమతి పత్రాలను పరిశీలించారు. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్, డీఈఓ రాజేందర్, డీఎస్‌డీఓ సునీత, డీవైఎస్ఓ రఘు, డీఎంహెచ్ఓ మధుసూదన్, తహసీల్దార్ నాగరాజు, పలు శాఖల అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



కేజీబీవీలో విద్యార్థినితో పాఠం చదివిస్తున్న కలెక్టర్

సూర్యాస్తమయం.. సప్తవర్ణశోభితం!

మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో దేవస్థానం పడమర వైపున ఆర్చీ గేటు సూర్యాస్తమయం సమయంలో మబ్బులతో సప్తవర్ణశోభితంగా బుధవారం సాయంత్రం దర్శనమిచ్చింది.దీంతో ఆర్చీగేటు రంగురంగుల్లో మెరిసిపోతూ చూపరులను కనువిందు చేసింది.

– కాళేశ్వరం



క్లుప్తంగా

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


శ్రీకాంత్ (ఫైల్)

దేవరుప్పుల : తండ్రి మందలించాడనే కారణంతో ఓ యువకుడు మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం దేవరుప్పులలో చోటుచేసుకుంది. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జోగు శ్రీకాంత్(28) నిత్యం సెల్‌ఫోన్ చూస్తూ ఎలాంటి పనులు చేయడం లేదు. దీనిపై తండ్రి మైసయ్య.. శ్రీకాంత్‌ను మందలించాడు. స్నేహితులను ఆదర్శంగా తీసుకుని మారాలన్నాడు. దీనిపై మనస్తాపం చెందిన శ్రీకాంత్ పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. శ్రీకాంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై తండ్రి మైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పంటకు ఎరువు వేయడానికి వెళ్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బీల్యా(ఫైల్)

వర్ధన్నపేట: పంటకు ఎరువు వేయడానికి వెళ్తూ ఓ వ్యక్తి అనంతలోకాలకు చేరాడు. కారు..బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని కుమ్మరిగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య బీల్యా(50) ఇల్లంద గ్రామానికి చెందిన సట్ల సమ్మయ్య భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో పంటలో ఎరువులు వేయడానికి బుధవారం ఉదయం తన ట్రాక్టర్‌లో బస్తాలు వేయగా డ్రైవర్ మహేందర్ బయలుదేరాడు. ట్రాక్టర్ ముందు బీల్యా బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని మంద బాబు ఇంటి వద్ద వెనుక నుంచి వచ్చిన కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. దీంతో బీల్యా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు మురళి ఫిర్యాదు మేరకు ఈ ప్రమాదానికి కారణమైన హనుమకొండ శాంతినగర్‌కు చెందిన బైరి రవీందర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

జ్వరంతో యువకుడి మృతి


రాకేశ్(ఫైల్)

భూపాలపల్లి అర్బన్: జ్వరంతో మండలంలోని కాశీంపల్లికి చెందిన సిద్ధం రాకేశ్(27) మృతి చెందాడు. రాకేశ్‌కు పది రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినా తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు

యక్షగానం చేస్తున్న గజవెల్లి దామోదర్ బృందం



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన సందర్భంగా ఖిలావరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం రంజిత్ బృందం ప్రదర్శించిన పేరిణి నృత్యం, జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన గజవెల్లి దామోదర్ బృందం ప్రదర్శించిన చిందు యక్షగానం, బాల పురస్కార అవార్డు గ్రహీత పెండ్యాల లక్ష్మీప్రియ బృందం చేసిన మహారాజు రాణి రుద్రమాదేవి పౌరుషం నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ప్లాటినం జూబ్లీ హైస్కూల్ విద్యార్థులు పూజిత, లక్ష్మి ప్రతాప రుద్రుడి వేషధారణ అందరిని ఆకర్షించింది. -ఖిలావరంగల్


పేరిణి నత్యం చేస్తున్న రంజిత్ బృందం

నృత్యం చేస్తున్న సుధీర్ బాబు బృందం



ఆడపిల్ల.. ఇంటికి మహాలక్ష్మి

అమ్మ, నాన్న ఆలోచనలో మార్పు

ఆడ, మగ అనే వివక్ష లేదు



ఖిలా వరంగల్ : వందమంది కొడుకులు ఉన్నా ఇంటికి కళ రాదు.. కానీ మహాలక్ష్మి లాంటి ఒక్క ఆడపిల్ల ఉంటే ఆ ఇంట్లో సందడి వేరేగా ఉంటుంది. అందుకే ఓ సినీగేయ రచయిత కంటే కూతుర్నే కనాలిరా.. మనసుంటే మగాడిలా పెంచాలిరా.. అని ఏనాడో చెప్పాడు.. నేడు తల్లిదండ్రుల ఆలోచన తీరు మారుతోంది.. పుట్టబోయేది ఆడ అయినా, మగ అయినా సమానమే అనే భావన వారిలో పాతుకుపోయింది.. దీంతో అమ్మాయి పుడితే మహాలక్ష్మి ఇంటికి వచ్చిందని సంబురపడుతున్నారు.. అమ్మాయి అయితే చెప్పిన మాట వింటూ.. అమ్మకు చేదోడు వాదోడుగా ఉంటుంది అంటూ నాన్న మురిసిపోతున్నాడు. ఒకప్పటి భ్రూణ హత్యలు తగ్గడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమ్మాయిల నిష్పత్తి భాగానే ఉంది.

నాన్న మారిపోయాడు..

ఆడపిల్ల పుడితే ఆ ఇంట ఆనందమే.. మహాలక్ష్మి నట్టింట్లో అడుగు పెట్టిందని సంబురపడిపోయే సంస్కృతి మనది. రెండు, మూడు దశాబ్దాలకు ముందు ఎదిగిన ఆడపిల్ల గుండెలపై కుంపటి అని.. పెళ్లి చేసి ఒక అయ్యా చేతిలో పెట్టి బరువు దించుకోవాలనే పరిస్థితి ఉండేది. ఆడపిల్ల పుడితే కట్నం ఇవ్వాలి..పెళ్లి ఎలా చేయాలనే ఆలోచన ధోరణిలో మార్పు వస్తోంది. కానీ ప్రస్తుతం కొన్ని సామాజిక వర్గాల్లో పెళ్లికానీ అబ్బాయిలే తల్లిదండ్రులకు భారంగా కనిపించే పరిస్థితి వచ్చేసింది. కొన్ని వర్గాల్లో అమ్మాయిల కొరతతో కన్యాశుల్కాన్ని ఆచరిస్తున్నారు. నేడు అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారు. నాన్నకు గుండెలపై కుంపటిలా కాకుండా కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

కొనసాగుతున్న లింగవివక్ష..

నేటికి సైతం కొన్ని ప్రాంతాల్లో ఆడపిల్ల అనే లింగ వివక్ష కొనసాగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్కానింగ్ ద్వారా పుట్టబోయే బిడ్డ లింగ నిర్ధారణ రహస్యంగా చేస్తుంటే.. నగరంలో అల్ట్రాసౌండ్ మిషన్ల ద్వారా నిర్ధారణ చేస్తున్నట్లు సమాచారం. గర్భ విచ్ఛిత్తి ద్వారా పిండాన్ని నిర్వీర్యం చేస్తున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. దీనిని అరికట్టేందుకు పెనెటాల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఈ చట్టంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులతోపాటు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

తగ్గిన భ్రూణ హత్యలు..

ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు భ్రూణ హత్యలు ఆందోళన కలిగించాయి. సుమారు 500లకు పైగా ఆడ శిశువులు (పిండాలు) గర్భస్థ హత్యకు గురయ్యారు. కాగా తొమ్మిదేళ్లుగా భ్రూణ హత్యల శాతం తగ్గుతూ ప్రస్తుతం మెరుగ్గా ఉంది. జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో ప్రతి 1000 మంది మగవారికి.. 994 మంది మహిళలు ఉన్నట్లు సమాచారం. స్కానింగ్ సెంటర్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి లింగనిర్ధారణ పరీక్షలపై ఉక్కు పాదం మోపడంతో అబార్షన్ల శాతం తగ్గిపోయాయని వైద్యులు చెబుతున్నారు.



నాపేరు శ్రీకాంత్, మేము వరంగల్ ఫోర్ట్‌రోడ్డు నివాసం ఉంటాం. నాకు ఇద్దరు కుమార్తెలు. అయినా బెంగ లేదు. అబ్బాయి అయినా.. అమ్మాయి అని పర్వాలేదని మొదటినుంచే అనుకున్నా. నా కూతుళ్లతో ఎంతో ఆనందంగా ఉన్నా. బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే నా ధ్యేయం.

ఎవరైనా ఒకటేననే భావన



ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన చర్యలతో జిల్లాలో భ్రూణ హత్యలు తగ్గుముఖం పట్టాయి. అంతే కాకుండా ఆడ, మగ ఎవరైనా ఒకటే అని నేటితరం యువతలో పాతుకుపోయింది. దీంతో అమ్మాయిలంటే భయపడే వారు తగ్గిపోయారు. స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. కాలం మారుతున్న కొద్ది ఎవరైనా పర్వాలేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా అమ్మాయిలు దూసుకెళ్తున్నారు. తల్లిదండ్రులు సైతం అమ్మాయిలనే ఇష్టపడుతున్నారు.

\- డాక్టర్ నరేశ్‌కుమార్, రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు, వరంగల్

భర్తకు రెండో వివాహం చేసిన భార్య..

- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన


సంధ్యను వివాహం చేసుకుంటున్న సురేశ్

మహబూబాబాద్ అర్బన్ : ఓ భార్య తన భర్తకు దగ్గర ఉండి మరో వివాహం చేసింది. తాను ఇష్టపడుతున్న యువతితో ఏడు అడుగులు వేయించింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భక్తమార్కండేయ దేవాలయంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నగూడురు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన దాసరి సురేశ్, సరిత దంపతులకు కొన్ని ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని భక్తమార్కండేయ గుడి వీధికి చెందిన లాకా పద్మ, వీరస్వామి దంపతుల చిన్న కుమార్తె సంధ్య వరుసకు సురేశ్‌కు మరదలు అవుతుంది. సంధ్య మానసిక దివ్యాంగురాలు. సంధ్యను ఇష్టపడుతున్నట్లు సురేశ్ తన భార్య సరితకు చెప్పడంతో ఆమె భర్త రెండో వివాహనికి అంగీకరించింది. దీంతో బుధవారం ఇరువర్గాల పెద్దలు, భార్య సరిత సమక్షంలో పట్టణంలోని భక్తమార్కండేయ దేవాలయంలో వివాహం జరిపించారు. కాగా, భర్తకు రెండో వివాహం జరిపించిన విషయం సోషల్ మీడియాలో, జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది. దీనిపై సరితను వివరణ కోరగా సంధ్యను తన భర్త సురేశ్ ఇష్టపడ్డాడని, సంధ్య మానసిక దివ్యాంగురాలు అన్నారు. పిల్లల మనసత్వం కలదని, తన పిల్లల మాదిరిగానే చూసుకుంటానని చెప్పింది.

పోలీసులకు ఫిర్యాదు..

వివాహం జరగకముందు సంధ్య సోదరి భర్త నాగరాజు ఉదయం 11 గంటలకు తన మరదలు మానసిక దివ్యాంగురాలు కావొచ్చన్నారు. కానీ రెండో వివాహం చేయడం నేరమని గొడవకు దిగి 100 డయల్‌కు కాల్ చేశాడు. బ్లూకోర్టు సిబ్బంది వివాహం జరుగుతున్న ఆలయానికి చేరుకుని ఆధార్ కార్డు పరిశీలించారు. పెళ్లికూతురు మేజరని, ఇరువురి ఇష్టపూర్వకంగా వివాహం జరుగుతుందని తెలిపారు. 100 డయల్‌కు కాల్ చేసిన వ్యక్తిని మందలించి అక్కడి నుంచి పంపించారు. ఇదిలా ఉండగా రెండో వివాహాన్ని పోలీసులే ప్రోత్సహించారని పలువురు పెద్దలు పేర్కొన్నారు.

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు బ్రేక్

- డీన్లు, విభాగాల అధిపతులు, బీఓఎస్‌లతో రిజిస్ట్రార్ సమావేశం
- లీగల్ ఒపీనియన్ తీసుకుని ముందుకెళ్లాలని నిర్ణయం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డి అడ్మిషన్లకు బ్రేక్ పడింది. 2021–2022 నోటిఫికేషన్ ద్వారా పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తరువాత అప్పటి నుంచి ఈఏడాది మార్చి 31వ రకు వెకెన్సీలుగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీకి పాత నోటిఫికేషన్‌లోని మెరిట్ లిస్టు ప్రకారం అధికారులు అడ్మిషన్ల కలనకు ఉపక్రమించబోతున్నారు. ఈ మేరకు ఇటీవలే నిర్వహించిన పాలకమండలి నిర్ణయం మేరకు రిజిస్ట్రార్ ఉత్తర్వులతో విభాగాల వారీగా డీన్లు విభాగాల అధిపతుల నుంచి పీహెచ్‌డీల వెకెన్సీల వివరాలు సేకరించారు. భర్తీచేసేందుకు ఉపక్రమించబోతున్నారు.

కేయూ రిజిస్ట్రార్ సమావేశం

కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల డీన్లు, విభాగాల అధిపతులు, బీఓఎస్‌లతో బుధవారం సాయంత్రం కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగంలో ఓ అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించారని, కోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలనేది వారితో చర్చించారని తెలిసింది. దీంతో లీగల్ ఒపీనియన్ తీసుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో పీహెచ్‌డీ మొదటి కేటగిరీ అడ్మిషన్ల ప్రక్రియ అనంతరం మిగిలిన సీట్లను ఇటీవలే రెండో కేటగిరీలోకి మార్చారు. అందులో వివిధ విభాగాల్లో 67 సీట్లు ఉన్నట్లు గుర్తించి విభాగాల వారీగా ఆయా విభాగాల్లో 2021–2022 నోటిఫికేషన్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ అనంతరం మెరిట్ లిస్టు ప్రకారమే ఆయా అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఇటీవలే ఆర్డర్లు ఇచ్చారు. దీంతో అందులో 48మంది జాయిన్ అయ్యారు. కొందరు ఇంకా జాయిన్ కావాల్సింది.అయితే పీహెచ్‌డీ రెండో కేటగిరీలో ఈఏడాది మార్చి31 వరకు ఏర్పడిన వెకెన్సీల వివరాలు సేకరించారు. అందులో భర్తీచేయబోతుండగా ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అభ్యర్థి కోర్టుకు వెళ్లాడు. దీంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఇప్పుడు పీహెచ్‌డీ రెండో కేటగిరీలోని అడ్మిషన్లకు బ్రేక్ పడింది.

ఆశావాహుల్లో ఆందోళన

పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లకు ఈఏడాది మార్చి 31వరకు ఏర్పడిన వెకెన్సీల్లో భర్తీ చేస్తారని, అందులో సీట్లు వస్తాయని భావిస్తున్న పలువురు ఆశావాహులు బుధవారం సాయంత్రం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి వద్దకు వెళ్లి మీరు జాప్యం చేయడం వల్లే ఈసమస్య తలెత్తిందని వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఇంజనీరింగ్ విభాగం మినహాయించి మిగతా విభాగాల్లో అడ్మిషన్లు చేపట్టవచ్చుకదా అని కూడా రిజిస్ట్రార్ ప్రశ్నించినట్లు సమాచారం. అయితే లీగల్ ఒపీనియన్ తీసుకుని పీహెచ్‌డీ అడ్మిషన్ల విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటామని రిజిస్ట్రార్ వారికి తెలియజేసినట్లు సమాచారం.

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: కాకతీయ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రవేశాలను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పాత నోటిఫికేషన్ మెరిట్ లిస్టుతో కొత్త సీట్లు ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించిన ధర్మాసనం.. కొత్తగా పీజీ పాసైన వారు, మళ్లీ పరీక్ష రాయాలనుకుంటున్న వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించింది. నోటిఫికేషన్‌లో చూపిన సీట్లకు మించి ఒక్క సీటు కూడా ఎక్కువగా నింపడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. పాత నోటిఫికేషన్ ద్వారా కొత్త సీట్లను నింపడానికి కాకతీయ వర్సిటీ ఈ నెల 16న జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హనుమకొండకు చెందిన చల్లా అమరేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. కొత్త సీట్లకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి అర్హులందరికీ సమాన అవకాశం కల్పించాలంటూ పిటిషనర్ తరఫున న్యాయవాది అఖిల్ వాదనలు వినిపించారు. విశ్వవిద్యాలయం తరఫున పి.భానుప్రకాష్, ప్రభుత్వం తరఫున ఉన్నత విద్యాశాఖ జీపీ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ నెల 16న రిజిస్ట్రార్ జారీ చేసిన ఉత్తర్వులను నిలుపుదల చేశారు. దాని ఆధారంగా ఎటువంటి ప్రవేశాలు చేపట్టరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

రూ. 5.45 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్, ఇద్దరు పరార్

మహబూబాబాద్ రూరల్ : రూ. 5.45 లక్షల విలువైన 21.8 కిలోల ఎండు గంజాయిని పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ కోర్టు సెంటర్‌లో టౌన్ ఎస్సై బి.విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ఓసీ క్లబ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారి వద్దకు వెళ్తుండగా పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నారు. సదరు వ్యక్తులను మహారాష్ట్రలోని థానే రబాలే సిద్ధార్థ నగర్‌కు చెందిన పప్పు కుమార్‌సింగ్, శివాజీనగర్ మంఖుర్ద్ మిలన్ నగర్‌కు చెందిన మహిళ హీన హుస్సేన్ అన్సారీగా గుర్తించి వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. ఇందులో రూ. 5.45 లక్షల విలువైన 13 ప్యాకెట్లు (21.8 కిలోలు) ఎండు గంజాయి లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. మరో ఇద్దరు ఒడిశాలోని భువనేశ్వర్ నయాగర్ ప్రాంతానికి చెందిన రాము, మహారాష్ట్ర న్యూముంబయి థానే ప్రాంతానికి చెందిన రహీం పరారయ్యారని టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు.

ఏనుమాముల ప్రాంతంలో 6 కేజీలు..

వరంగల్: ఏనుమాముల ప్రాంతంలో గంజాయి విక్రయదారుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 6 కేజీల సరుకు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. పీఎస్ పరిధిలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు సిబ్బందికి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. ప్రశ్నించే క్రమంలో పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో అదుపులోకి విచారించగా తన వివరాలతోపాటు గంజాయి విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. ఒడిశాలోని కేసరిగూడకు చెందిన దీపక్ సబర్ సెక్యూరిటీ గార్డు పనిచేస్తున్నాడు. వచ్చే వేతనం సరిపోకపోవడంతో సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. ఈనెల 27వ తేదీన ఒడిశాలో ఓ వ్యక్తి వద్ద 6 కిలోల గంజాయి కొనుగోలు చేసి పూణె తరలించే క్రమంలో వరంగల్‌లో రైలు మిస్ అయింది. దీంతో ఏనుమాముల ప్రాంతానికి వచ్చాడు. ఈక్రమంలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై ఎం.రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

మక్కలకు అధిక ధర

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మక్కలకు ఈసీజన్‌లోనే అధిక ధరలు లభిస్తున్నాయి. బుధవారం పాత రకం మక్కలకు క్వింటాల్‌కు రూ.2911, కొత్త రకానికి రూ.2905 ధర పలికినట్లు అధికారులు తెలిపారు. సంగెం మండలం బాలునాయక్ తండాకు చెందిన బానోత్ ధన్‌సింగ్ మార్కెట్‌కు తీసుకొచ్చిన మక్కలకు, రేగొండ మండలం జూబ్లీనగర్‌కు చెందిన పి.రవీందర్ తీసుకొచ్చిన కొత్త మక్కలకు ఈసీజన్‌లోనే అధిక ధరలు లభించాయని అధికారులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

- బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం



రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 20 జరిమానా విధించడంతోపాటు బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం చెల్లించాలని వరంగల్ పోక్సో ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ మనీషా శ్రవణ్ ఉన్నామ్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. పాపయ్యపేట చమాన్‌కు చెందిన రామరావుల ప్రభుచరణ్.. ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమకొండ ఏసీపీ చంద్రయ్య ప్రత్యేక విచారణ చేపట్టారు. ఈ కేసులో అప్పటి నుంచి న్యాయవాదులు సత్యనారాయణ, వాసుదేవారెడ్డి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయి వాదనలు వినిపించగా స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ నిందితుడికి రూ. 20 సంవత్సరాల జైలు శిక్ష, బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కేసులో బాధిత కుటుంబానికి అండగా నిలిచి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన న్యాయవాదులతో పాటు కోర్టు లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, కోర్టు కానిస్టేబుళ్లను పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

మొక్కమొక్కకూ నీరు..

- మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతు భగీరథ ప్రయత్నం



ట్యాంకర్‌తో మిర్చి పంటకు నీరు పోస్తున్న రైతు కనుకయ్య దంపతులు


మొక్క మొక్కకు నీరుపోసి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న రైతు దంపతులు

వేలేరు: ప్రస్తుతం సరైన వర్షాలు కురవకపోవడం.. కళ్ల ముందే చేను ఎండిపోతుండడంతో రైతన్న గుండె చెరువవుతోంది. ఆ చేనును కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన చిలువేరు కనకయ్య తనకున్న మూడెకరాల్లో ఎకరంలో పత్తి, రెండు ఎకరాల్లో నెలన్నర క్రితం వరినారు పోశాడు. ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో ఇంకా నాటు వేయలేదు. దీంతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగుచేస్తున్నాడు. పదిహేను రోజుల క్రితం మిర్చి నాటుకోగా అప్పటినుంచి నేటి వరకు వర్షాలు కురవకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. చేసేదేమి లేక ఒక్కో ట్యాంకర్‌కు రూ.1,200 చెల్లించి నీటిని తీసుకువచ్చి భార్యాభర్తలు ఇద్దరు కలిసి బిందెలు, బకెట్లతో మొక్క మొక్కకు నీరు పోస్తూ చేనును రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

తూర్పుతండా స్టేజీ దగ్గర వాడిపోతున్న పత్తిచేను



వాడిపోతున్న పత్తి చేను

దంతాలపల్లి: పదిహేను రోజులనుంచి వర్షాలు లేకపోవడంతో పత్తి వాడిపోతోంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం గున్నెపల్లి, తూర్పుతండా, కుమ్మరికుంట్ల తో పాటు మండంలో పలుగ్రామాల్లో పత్తి, కంది పంటలు వాడిపోతున్నాయి. పత్తి చేను మొగ్గ వచ్చే దశలో నీళ్ల అవసరం బాగుంటుంది. కొన్ని రోజులుగా వర్షాలు రాకపోవడంతో మొగ్గకు వచ్చే చేను, ఇంతకు ముందు పూసిన పత్తి వాడి రాలిపోతోంది. మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు రాకపోతే ఆ పంట చేలు పూర్తిగా ఎండిపోతాయని, రైతులకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలుపుతున్నారు.